రాష్ట్రంలో మారీచులంతా ఒక్కటయ్యారు

- ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగేది 2024 ఎన్నికలు
- ధర్మం వైపు ఉన్న సీఎం జగన్‌ను అండగా నిలవండి
- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గడికోట



లక్కిరెడ్డిపల్లె: లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీలు



సంబేపల్లె: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఈ ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో పెంచిన పెన్షన్ల పంపిణీలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోనే ఐదు వేలకు పైగా పెన్షన్లు పంపిణీ అవుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో కొత్త పెన్షన్ మంజూరు కావాలంటే ఎవరైనా చనిపోతేనే వచ్చేదన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు రాజ్యమేలాయన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందజేశామని తెలియజేశారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు బేరీజు వేసుకుని ప్రజలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజారంజకంగా పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని మారీచులందరూ ఒక్కటయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు నీరు అందిస్తామని హామీనిచ్చారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే 2024 ఎన్నికల్లో ధర్మం వైపు సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, బీసీ నాయకులు విజయభాస్కర్, రవి ఆచారి, సాదుల్లా, ఎంపీటీసీలు దస్తగిరి, లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, సర్పంచ్‌లు సిద్ధక నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొండా ప్రసాద్ రెడ్డి, వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

సంబేపల్లె : ప్రజల సుఖ సంతోషాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె మండల కేంద్రంలో జరిగిన పెన్షన్ల పెంపు, నూతన పెన్షన్ల పంపిణీలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మలి సందెల్లో ఆసరా కోసం ఎదురు చూసే అవ్వాతాతలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. వారికిచ్చే వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని ఇచ్చిన మాట ప్రకారం పెంచుతూ ఇళ్ల వద్దే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాత పార్టీ అని పేర్కొన్నారు. ఏ ఒక్క పెన్షన్ తొలగించకుండా కొత్త పెన్షన్లు మంజూరు చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. మండలంలో 6 వేల పెన్షన్లు పంపిణీ అవుతున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో చెప్పుకునేదానికి శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. మేలు జరిగి ఉంటేనే మద్దతుగా నిలవాలన్న వ్యక్తి ఒక్క సీఎం జగనేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరం రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, వడ్డి వెంకటరమణా రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్పెషల్ ఆఫీసర్ మద్దిలేటి, ఎంపీడీఓ నరసింహులు, తహసీల్దార్ మహేశ్వరీబాయి, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

ఓదివీడులో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని ఓదివీడు గ్రామంలో రాయచోటి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మహమ్మద్ అలీఖాన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఓదివీడు కస్బాలోని మండల పరిషత్, తెలుగు/ఉర్దూ పాఠశాలల పరిసర ప్రాంతాలలో ఈ కార్యక్రమం జరిగినట్లు సర్పంచ్ శంకరమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఓదివీడు వైఎస్సార్‌సీపీ నాయకులు పివి శివరాం, తెలుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఇమాంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సంబేపల్లె : మండల కేంద్రంలో గురువారం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆవిష్కరణలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, చిదంబర్ రెడ్డి, రెడ్డి కమ్యూనిటీ నాయకులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

గాలివీడు : నేడు రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండలానికి రానున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9గంటలకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్బీకే ప్రారంభం

నందలూరు(రాజంపేట) : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల సమూహం వద్ద నూతనంగా నిర్మించిన నందలూరు గ్రామ పంచాయతీ–1 రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమిశెట్టి సునీత, సర్పంచ్ ప్రతినిధి మోడపోతుల రాము, మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్ర, జెడ్పీటీసీ ప్రతినిధి గడికోట సుబ్బారెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ, ఉప సర్పంచ్ ఇబ్బు, సయ్యద్ అమీర్, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైకు యాత్రికుడికి అభినందన

రాయచోటి టౌన్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చెప్పేందుకు బైకు యాత్ర ద్వారా 175 నియోజక వర్గాలలో పర్యటించి సొంతూరుకి చేరిన యాత్రికుడు ఫిర్దోస్ ఖాన్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. రాయచోటి పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కౌన్సిలర్ గౌస్‌ఖాన్ కుమారుడు ఫిర్దోస్‌ఖాన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితుడై వాటిని ప్రజలకు వివరించాలనే సంకల్పంతో 23 రోజుల్లో 7100 కి.మీ.లు పర్యటించి ప్రజలకు పథకాలను వివరించినట్లు ఫిర్దోస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారీ మహమ్మద్‌ఖాన్, ఫయాజ్ అహమ్మద్, పట్టణ అధ్యక్షులు రియాజుర్ రహిమాన్, జానం రవీంద్రా యాదవ్, వాల్మీకి సంఘం అధ్యక్షులు గువ్వల బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

సిద్దవటం : ప్రజలు రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలంలోని కమ్మపాలెం గ్రామంలో గురువారం రాత్రి పైలేరియా బోధ వ్యాధిపై సర్వే నిర్వహించి, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. 200 మందికి రక్త పూతలను సేకరించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని గ్రామ ప్రజలకు ఆయన తెలియజేశామన్నారు. కార్యక్రమంలో పి. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ రంగలక్ష్మి, సీహెచ్ఓ శంషాద్‌బేగం, ఎంఎల్‌హెచ్, సీనియర్ ఆరోగ్య కార్యకర్త లక్ష్మమ్మ, ఆశ వర్కర్లు, హెల్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణ

రాజంపేట : నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఆహారపు అలవాట్లతో మంచి ఆరోగ్యం పొందవచ్చునని మదనపల్లె ప్రకృతి వ్యవస్థాపకులు ఎంసీవీ ప్రసాద్ అన్నారు. గురువారం ఏఐటీఎస్‌లో ప్రకృతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ వ్యాయామం, సరైన నిద్ర, పప్పు ధాన్యాలు తీసుకోవడం వల్ల ఉల్లాసంగా, ఉత్తేజంగా జీవనం సాగించవచ్చునన్నారు. కార్యక్రమంలో చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, సీఎస్ఈ హెచ్ఓడీ డా.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి 7న శోభాయాత్ర

నందలూరు(రాజంపేట) : జనవరి 22న అయోధ్యలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న శ్రీరామ శోభాయాత్రలో భాగంగా ఈనెల 7న హిందూ చైతన్య వేదిక, శ్రీరామ సేవా సమితిల ఆధ్వర్యంలో అయోధ్య రామయ్య శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె ఎర్రచెరువుకట్ట మీద ఉన్న అభయాంజనేయస్వామి గుడి నుంచి శ్రీ సౌమ్యనాథస్వామి దేవాలయం వరకు ఈ యాత్ర సాగుతుందని ఆయన తెలియజేశారు. భక్తులు పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ అధ్యక్షుల ఎంబలూరు నరసింహ, పోతురాజు మస్తానయ్య, సునీల్ రెడ్డి, జయచంద్రారెడ్డి, నవీన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

సిద్దవటం : ఈనెల 7న భాకీపేట లోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే పత్రా కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఒంటిమిట్ట దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డే సుబ్బానాయుడు, పత్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలుపుల శ్రీనివాసుల నాయుడు తెలిపారు. గురువారం సిద్దవటం మండలంలోని భాకరాపేటలో వారు మాట్లాడుతూ మండలంలోని మిట్టపల్లి, భాకరాపేట, ఒంటిమిట్ట మండలంలోని పత్రా గ్రామాల్లో పత్ర కులస్తులు ఈ ఆత్మీయ సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు. పత్ర కులస్తుల గ్రామాల్లోని పెద్దలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పట్టణానికి నందనవనం నగరవనం



నగరవనంను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట : రాజంపేట పట్టణానికి నందనవనం అటవీశాఖ తీసుకొస్తున్న నగరవనమని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం రాజంపేట – రాయచోటి రహదారిలో ఎస్ఆర్‌పాలెం సమీపంలో రూపుదిద్దుకుంటున్న అటవీ నగరవనం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితం గడిపే పట్టణవాసులకు నగరవనం ఆహ్లాదకరమైన వాతవరణం అందిస్తుందన్నారు. ప్రజలకు అటవీ ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం నగరవనాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ మాట్లాడుతూ పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో నగరవనం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రూ.2 కోట్ల వ్యయంతో నగరవనం రూపుదిద్దుకుంటోందన్నారు. అటవీ అందాలను రాజంపేట వాసులకు అందచేసేందుకు అటవీశాఖ నగవనాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, నాయకులు డీలరు సుబ్బరామిరెడ్డి, సుబ్బరాజు, రాజంపేట రేంజర్ నారాయణ, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదే

- పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆపన్నహస్తం
- ప్రభుత్వవిప్ కొరముట్ల, అజయ్ రెడ్డిలు



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డిలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రాష్ట్రంలో నెలకు సుమారు రూ. 2 వేల కోట్లను పింఛన్ల కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పెరిగిన పింఛన్ల పంపిణీలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో అత్యధిక పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదేనన్నారు. గత చంద్రబాబు పాలనలో పింఛన్ల తీసుకునేకి తెల్లవారుజామునే లేచి పింఛన్ల బుక్కులు వరుసలో పెట్టి గంటల తరబడి వేచివున్న అందేది కాదన్నారు. నేడు గడప వద్దకే పింఛన్లను అందిస్తూ అవ్వాతాతలు, వితంతువులకు ఆపన్నహస్తం అందిస్తున్నారని పేర్కొన్నారు. పింఛన్ లబ్ధిదారులు జగనన్నకు తోడుగా నిలబడాలని వారు కోరారు. ఒక ఏడాదిలో కోడూరు నియోజకవర్గానికి మాత్రమే రూ.120 కోట్లు పింఛన్ల కోసం నిధులు అందిస్తున్నామన్నారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఉప సర్పంచ్ జేపూరు చిన్న వెంగల్ రెడ్డి, వైఎస్సార్ సిపి సీనియర్ నాయకుడు బిఎల్ నరసింహారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, కాకతీయ వెంకటేశ్వర రెడ్డి, గుండ్లూరు శివ, రామ్మోహన్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె : కందిపంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామంలో క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ కంది పంట సాగుకు సంబంధించి ఎస్ఆర్‌జీ–105 విత్తనరకంతోపాటు సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. దీంతో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. అంతర్ పంటలకు అనువైన రకం అని 160–170 రోజుల్లో వర్షాధారంలో ఎకరాకు 8 – 10 క్వింటాళ్ల దిగుబడిని పొందవచ్చన్నారు. ఇందులో అంతర్ పంటలుగా ఆపరాలు, వేరుశనగ, చిరుదాన్య పంటలను కూడా వేసుకోవచ్చన్నారు. లక్కిరెడ్డిపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి మాట్లాడుతూ కందిని ప్రధాన పంటగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కందిలో లోతు దుక్కులు చేసుకోవడం వలన లోపల ఉండే గట్టి పొరలు చేధించబడి నీరు భూమి లోపల పొరలోకి ఇంకడం వలన పోషకాలను మరియు తేమను పంటకు అందించబడతాయన్నారు. కేవీకే వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్య మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంట సాగు చేయడం వలన పెట్టుబడి తగ్గి ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిటిఎం పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయంపై హర్షం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో 30వేల మందిపైగా బస్సు యాత్ర, ర్యాలీలో పాల్గొని భాగస్వామ్యమై యాత్రను విజయవంతం చేశారన్నారు. 50 సంవత్సరాలలో ఎప్పుడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు స్వచ్ఛందంగా మేముసైతం వైఎస్సార్‌సీపీకి తోడుగా ఉన్నామంటూ యాత్రలో పాల్గొనడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు తనపై ఉన్న ప్రేమ, అభిమానం సామాజిక యాత్ర ద్వారా నిరూపితమైందన్నారు. అలానే యాత్రకు పోలీసులకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. యాత్రపై తుస్సుమందని అసత్య కథనాలు రాసిన పచ్చపత్రికలను ఆయన తప్పుబట్టారు. పచ్చ పత్రిక వాస్తవాలను ప్రచురించడం ఏనాడో మార్చిపోయాయన్నారు. 2024లో టీడీపీకి అభ్యర్థులు కూడా దొరకరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసుల రెడ్డి, మందల నాగేంద్ర, సుధాకర్‌రాజు, తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, గునిశెట్టి రమేష్, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో దేశభక్తి



యూనిఫాంను అందిస్తున్న సెక్రటరీ నరసింహారెడ్డి

గాలివీడు : స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం, ధైర్యసాహసాలు పెంపొందుతాయని అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గాండ్లపల్లి, నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన యూనిట్లను ప్రారంభించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లో 12 నుంచి 32 మంది విద్యార్థులు ఉంటారని, పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ధృవపత్రాలు విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ నాగరాజ, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్‌బాషా, దుర్గేశ్వర్ రాజు, సుధాకర్, ఉపాధ్యాయులు మహేశ్వరయ్య, శివారెడ్డి, వెంకటయ్య, పీడీలు గంగరాజు, వాణీ శ్రీ, వరదరాజు, ఫయాజ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లను గుర్తించిన ఏకైక సీఎం జగన్



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలోని పాస్టర్లను గుర్తించి వారికి మేలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ క్రైస్తవ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.వెంకటేష్, క్రైస్తవ విభాగం జిల్లా చైర్మన్ బోనాసి జాన్‌బాబు తెలిపారు. మండలంలోని తుమ్మల అగ్రహారంలో ఉన్న బేతేలు చర్చిలో గురువారం యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ రాజంపేట శాఖ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ పాస్టర్లను గుర్తించి వారికి గౌరవ వేతనం ఇవ్వడం చారిత్రాత్మకమైన విషయమన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో రాజంపేటలో క్రైస్తవ శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్, క్రిస్టియన్ కమిటీ భవన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా క్రైస్తవులు జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు దయప్రేమసాగర్, మార్టిన్ లూథరన్, ప్రేమ్‌కుమార్, ఫిలోమాన్, విజయ్‌కుమార్, జీవప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పుల్లంపేట : మండల వనరుల కేంద్రంలో డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ చక్రధర్ ఆధ్వర్యంలో యుటీఎఫ్ డైరీ, అధ్యాపక దర్శినీ క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాంబశివరావు, ఎస్‌వి రమణలు తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణ మూర్తి, వరదారెడ్డి, కొండా రవి, హుస్సేన్ పీరా, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

8న మాధవరంలో క్రికెట్ టోర్నీ

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీని ఈనెల 8వ తేదీ ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు మునెయ్య, నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ, మేడా బ్రదర్స్ ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీని ఏర్పాటు చేశామన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు అందజేస్తున్నారన్నారు. 7వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ. 999 చెల్లించాలన్నారు. వివరాలకు మునెయ్య 6305119940, నరసింహ 9553678123 నెంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

ఓబులవారిపల్లె : గాడెల వెంకటాపురానికి చెందిన కిడ్నీ బాధితుడు జి.వెంకటాచలపతికి వైఎస్సార్ పార్టీ నేత కొమ్మూరు శంకర్ రెడ్డి గురువారం రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. రెండు సంవత్సరాల నుంచి డయాలసిస్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న శంకర్ రెడ్డి బాధితుడికి నగదును అందించారు.

ఆర్థిక సహాయం

ఓబులవారిపల్లె : మండలంలోని పెరుమాళ్ళపల్లి దళితవాడ గ్రామానికి చెందిన దనాసి తిరుపయ్య ఈనెల 3వ తేదీ మూర్ఛవ్యాధితో మృతి చెందాడు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మృతుని కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సాయికిషోర్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డిలు తిరుపయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సర్పంచ్ ఈశ్వరయ్య, రవిచంద్ర, మారెె సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నందలూరు(రాజంపేట) : స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ ఓవర్ రోవర్స్ స్కౌట్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ సంస్థ 25వ వార్షికోత్సవ సందర్భంగా అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ సారథ్యంలో నిర్వహించిన పోటీలను ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐకేపీఎస్ సంస్థ అధ్యక్షులు ఆర్ముగం విశ్వనాథ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లోకమాన్ సింగ్, రౌఫ్ బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

రాయచోటి టౌన్ : ముందస్తు సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటుకోవాలని డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాయచోటి పట్టణంలోని బాలికోన్నత పాఠశాల మైదానంలో నేటి(శుక్రవారం) నుంచి రెండు రోజులపాటు ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంబరాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నటు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చుని పేర్కొన్నారు.

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మండలంలోని రైతుల సర్వే సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుల్లారెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.దుర్గా ప్రసాద్, డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్ కుమార్ రెడ్డి, నందలూరు వెంకటసుబ్బారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



రాజంపేట టౌన్: పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా



నందలూరులో పెన్షన్ నగదు ఇస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

- నవరత్నాలతో జీవన ప్రమాణాలు మెరుగు
- పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మూడు వేల రూపాయలకు పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు వారు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి మోముల్లో చిరునవ్వులు చూడాలన్నదే సీఎం ఆశయమన్నారు. నవరత్నాల పథకాలు పేదల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. జగన్ సీఎం అయితేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పుకొచ్చారు. అందువల్ల ప్రతి ఒక్కరు వచ్చే ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అలానే ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలోని లబ్ధిదారులకు పెరిగిన పింఛన్లను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు. అనంతరం ఎంఆర్‌కే కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి చేతుల మీదుగా వలంటీర్లకు దుస్తులను పంపిణీ చేశారు.

రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

నందలూరు(రాజంపేట) : సంక్షేమ పథకాల అమలులో దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా సీఎం జగన్ నిలిపారని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను దశలవారీగా రూ. 3 వేలకు పెంచారన్నారు. పేదలంటే మక్కువ ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు భారత దేశ చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా, ఎవరూ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, ఎంపీటీసీలు ఎస్.సునీత, సుభాన్, సయ్యద్ అమీర్, కో–ఆప్షన్ సభ్యుడు కలీం, సర్పంచ్‌లు సూర్యనారాయణ, మైనుద్దీన్, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, నాయకులు గడికోట సుబ్బారెడ్డి, నరసయ్య, ఆర్ముగం విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపార్చన



రాజంపేట టౌన్ : పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన ఏడాదిలో వచ్చిన తొలి గురువారాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.